

జీ 20 సదస్సుపై సమీక్ష

విశాఖ: సీఎం జగన్‌తోపాటు దేశ, విదేశీ అతిథులు పాల్గొనే జీ-20 సదస్సు సన్నాహాలపై కలెక్టర్ మల్లికార్జున సమీక్షించారు.



24న స్థాయీ సంఘ సమావేశం

విశాఖ: జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం ఈ నెల 24న మేయర్ హరివెంకటకుమారి అధ్యక్షతన నిర్వహించనున్నారు.



షిప్‌యార్డు సందర్శన

విశాఖ: నేవల్ స్టాఫ్ చీఫ్ వైస్ అడ్మిరల్ ఎస్ఎన్ ఘోర్మడే మంగళవారం హిందూస్థాన్ షిప్‌యార్డుని సందర్శించారు.

అమ్మ మోము దేదీప్యమానం



నూకాంబిక అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

నేత్రపర్వంగా నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతర



మంత్రి అమర్‌నాథ్‌కు అమ్మవారి చిత్రపటం అందిస్తున్న ఆలయ ఈవో చంద్రశేఖర్

అనకాపల్లి టౌన్: అమ్మల గన్న అమ్మ.. గవరపాలెం నూకాలమ్మ దేదీప్యమానంగా వెలిగిపోతూ భక్తులకు దర్శనమిచ్చారు. కొత్త అమావాస్య వేడుకలు మంగళవారం నేత్రపర్వంగా జరిగాయి. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అర్చకులు పూజలు చేశారు. అమ్మవారి దర్శనభాగ్యం కోసం ఆలయం ముందు భక్తులు బారులుదీరారు. జిల్లా ఖోఖో అసోసియేషన్ అధ్యక్షుడు దాడి జయవీర్, ఆలయ ఈవో చంద్రశేఖర్‌లు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. మంత్రి అమర్‌నాథ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాడి వీరభద్రరావు, ఇన్‌చార్జి డీఎస్పీ మళ్ల మహేశ్వరావు తదితరులు దర్శించుకున్నారు.

కొత్త ఊసులు.. కొంగొత్త ఆశలు.. వే'కువకువలతో చిన్నారుల కిలకిలారావాలు.. శోభకృత్ నామసంవత్సరానికి శోభాయమాన స్వాగతాలు.. సంప్రదాయ దుస్తులు ధరించిన విద్యార్థులు చోడవరంలో ముత్యాల ముగ్గులతో అలరించారు. పువ్వులు, ఆకులు, మామిడి కాయలతో పర్యావరణహితంగా కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు. ఉగాది సంబరాలకు ఒకరోజు ముందే శ్రీకారం చుట్టారు – చోడవరం రూరల్



శోభకృత్ శోభాయమానం



న్యూస్‌రీల్

పెన్సిల్ మొనపై ఉగాది శుభాకాంక్షలు



మాడుగుల రూరల్ : మండలంలోని ఎం.కోడూరు గ్రామానికి చెందిన మైక్రో ఆర్టిస్ట్ నెయ్యిదొండ గోపాల్ ఉగాది సందర్భంగా పెన్సిల్ మొనపై ఉగాది శుభాకాంక్షలు చెక్కారు. మొన పై భాగంలో ఉగాది పచ్చడి గిన్నె రూపాన్ని కూడా చెక్కాడు. దీనిని రూపొందించడానికి మూడు గంటల సమయం పట్టిందని గోపాల్ తెలిపారు. ఈయన ఎం.కోడూరు సచివాలయంలో వలంటీరుగా పనిచేస్తున్నారు. గతంలో ఎన్నో సూక్ష్మ కళారూపాలను పెన్సిల్ మొన మీద, సుద్ద ముక్కలపై చెక్కి పలువురి ప్రశంసలు అందుకున్నారు.

వర్షసూచన

అనకాపల్లిటౌన్ : రాగల అయిదురోజులు ఓ మోస్తరు వర్ష సూచన ఉందని అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం వాతావరణ విభాగం శాస్త్రవేత్త ఎంబీబీఎస్ కుమారి మంగళవారం తెలిపారు. ఈ నెల 22న 8, 23న 4, 24న 10, 25న 2, 26న 2 మి.మీ. చొప్పున వర్షపాతం నమోదయ్యే అవకాశాలున్నాయని పేర్కొన్నారు. ఉష్ణోగ్రతలు 24.8 నుంచి 25.4 డిగ్రీలు, తేమశాతం 75 నుంచి 77, గాలిగంటకు 7 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో వీస్తుందన్నారు.

ఎన్టీఆర్ ఆస్పత్రిలో కాయకల్ప బృందం



వైద్యాలయంలో పర్యటిస్తున్న కాయకల్ప ప్రతినిధులు

అనకాపల్లిటౌన్ : స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయాన్ని కాయకల్ప బృందం మంగళవారం సందర్శించింది. ఈ సందర్భంగా బృంద ప్రతినిధి, ఏపీ వైద్యవిధాన పరిషత్ జాయింట్ డైరెక్టర్ నరసింహారావు, రాష్ట్ర క్వాలిటీ కంట్రోల్ మేనేజర్ వేణులు ఆస్పత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 13 జిల్లా ఆస్పత్రులను దశలవారీగా పరిశీలించనున్నట్లు తెలిపారు. పరిశీలనాంశాల నివేదికను రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కేంద్రానికి పంపిస్తామన్నారు. వైద్యాలయంలో పరిశుభ్రత, రికార్డుల నిర్వహణను పరిశీలించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ కాయకల్ప ద్వారా 2017లో ఆస్పత్రికి అవార్డుతో పాటు రూ.10 లక్షలు, 2018లో రూ.5 లక్షలు మంజూరైనట్టు వెల్లడించారు. కార్యక్రమంలో ఆర్ఎంవో భారతి, వైద్యులు పాల్గొన్నారు.

జగనన్న గృహ'శోభ'

శోభకృత్ నామ ఉగాది పండగ గూడులేని పేదలకు గృహశోభను తీసుకొచ్చింది. ఉగాది లక్ష్యంగా గృహ నిర్మాణాలపై అధికారుల చర్యలు ఫలించాయి. జిల్లాలో మొత్తం 10,760 ఇళ్లను పూర్తి చేయాలని లక్ష్య నిర్దేశం చేసుకోగా.. ఉగాదికి 85 శాతంతో 9,093 ఇళ్ల నిర్మాణం పూర్తి చేశారు. రాష్ట్రంలో జిల్లాను ఆరో స్థానంలో నిలిపారు. మిగిలిన ఇళ్ల నిర్మాణం కూడా తుది దశకు చేరుకోవడంతో.. త్వరలోనే శతశాతం పూర్తి చేస్తామని అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

- 'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు'లో 85 శాతం నిర్మాణాలు పూర్తి
- రాష్ట్ర వ్యాప్తంగా గృహ నిర్మాణాల్లో 6వ స్థానంలో అనకాపల్లి జిల్లా
- ఉగాది నిర్మాణ లక్ష్యం 10,760.. పూర్తయిన గృహాలు 9,093



యలమంచిలి మున్సిపాలిటీ పరిధి మర్రిబంద లేఅవుట్‌లో దాదాపు పూర్తయిన జగనన్న కాలనీ



యలమంచిలి మండలం రేగుపాలెం లే అవుట్‌లో జగనన్న కాలనీ

సాక్షి, అనకాపల్లి : 'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు'పథకంలో భాగంగా ప్రభుత్వం సంకల్పించిన గృహ నిర్మాణ పనుల్లో అనకాపల్లి జిల్లా ముందంజలో నిలిచింది. ఉగాది నాటికి పూర్తి చేయాలనుకున్న ఇళ్ల నిర్మాణ లక్ష్యానికి చేరువై, తొలి పది జిల్లాల్లో ఆరో స్థానాన్ని దక్కించుకుంది. చిన్న చిన్న ఇబ్బందులతో ఆలస్యమై, చివరి దశకు చేరుకున్న ఇళ్లను కూడా త్వరితగతిన పూర్తిచేసేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు.

దాదాపు లక్ష్యానికి చేరువ

ఈ ఉగాది నాటికి జిల్లాలో 10,760 ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి పేదలకు అందించాలని లక్ష్య నిర్దేశం చేసుకున్నారు. ఇప్పటికి 9,093 ఇళ్ల నిర్మాణం పూర్తయింది. మిగిలిన 1,667 ఇళ్ల నిర్మాణం వివిధ దశల్లో ఉన్నాయి. వీటిలో కూడా చాలా వరకు 70 శాతానికి పైగా పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనుల్ని కూడా వేగంగా పూర్తి చేసేందుకు అధికారులు పరుగులు పెడుతున్నారు. ఇదే తరహాలో పట్టాలందుకున్న ప్రతి లబ్ధిదారు గృహ నిర్మాణ పనులు పూర్తి చేసేలా అధికారులు దృష్టిసారించారు.

ప్రతి శనివారం.. హౌసింగ్ డే

జగనన్న కాలనీల్లో పట్టాలందుకున్న ప్రతి ఒక్కరూ సొంతింటికి చేరుకునేలా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. అందులో భాగంగా ప్రతివారం కచ్చితమైన పురోగతి ఉండేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా ప్రతి శనివారాన్ని హౌసింగ్ డే గా నిర్ణయించారు. ఆ రోజు అధికారులందరూ క్షేత్ర స్థాయిలో పర్యటించి నిర్మాణంలో తలెత్తే సమస్యలను పరిష్కరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ నుంచి మండల ప్రత్యేక అధికారులు, హౌసింగ్ జిల్లా స్థాయి అధికారి వరకు అందరూ దీనిపై దృష్టిసారించారు. నాణ్యత కలిగిన ఇసుక, సిమెంట్, ఇటుకలు తదితర నిర్మాణ సామాగ్రిని అందించేలా సిబ్బంది చొరవ తీసుకుని, నిర్మాణంలో ప్రతి దశను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్లో అప్‌డేట్ చేసేలా చర్యలు చేపట్టారు.

చురుగ్గా విద్యుదీకరణ

జగనన్న కాలనీల్లో శాశ్వత మౌలిక సదుపాయాల కల్పన శరవేగంగా సాగుతోంది. జిల్లాలో తొలి దశలో విద్యుత్ స్తంభాలు, వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు వంటి పనులతో పాటు నిర్మాణాలు పూర్తయిన ఇళ్లకు మీటర్లను కూడా బిగిస్తున్నారు. దీని కోసం ప్రభుత్వం రూ.62.35 కోట్ల నిధులు వెచ్చిస్తోంది. జగనన్న కాలనీల్లో నిర్మించే ప్రతీ ఇంటికి ఒక కిలోవాట్ సామర్థ్యంతో విద్యుత్ సర్వీసు మంజూరు చేశారు. లబ్ధిదారుల ఇళ్లకు ఉచితంగానే విద్యుత్ మీటర్లు అందిస్తున్నారు. ఇందులో మీటరు బోర్డు, సర్వీస్ వైరు, ఎంసీబీ స్విచ్‌లు ఇస్తున్నారు.

శరవేగంగా గృహ నిర్మాణాలు



రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఉగాది లక్ష్యానికి దాదాపు చేరువయ్యాం. కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి పర్యవేక్షణలో జిల్లా వ్యాప్తంగా 85 శాతం వరకూ ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేశాం. మిగిలిన వాటిలో మరో 12 శాతం గృహాలు 75 శాతం మేర పనులు పూర్తి చేసుకున్నాయి. మిగిలిన 3 శాతం ఇళ్ల నిర్మాణం కూడా వర్షాలు, ఇతర కారణాల వల్ల ఆలస్యమైంది. వాటిని కూడా త్వరలో పూర్తిచేస్తాం. ఇళ్ల నిర్మాణ సమయంలో విద్యుత్ కూడా ప్రభుత్వం ఉచితంగానే అందిస్తుంది. నిర్మాణ సమయంలో బోర్‌వెల్స్‌కు ఉచిత విద్యుదీకరణ, నిర్మాణం పూర్తయిన ఇళ్లకు మీటర్లు ఏర్పాటు చురుగ్గా జరుగుతున్నాయి. లబ్ధిదారుడు సొంతంగా నిర్మించుకున్నా.. విద్యుత్ మీటర్లు ఉచితంగానే ఏర్పాటు చేస్తున్నాం.

– కూర్మనాయుడు, హౌసింగ్ జిల్లా అధికారి, అనకాపల్లి

శుభాకాంక్షలు

దేవరాపల్లి/తుమ్మపాల/అనకాపల్లి టౌన్: నూతన సంవత్సరంలో జిల్లా ప్రజలందరికీ శుభాలు జరగాలని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతి ఆకాంక్షించారు. ప్రతి ఇంటా ఆయురారోగ్యాలు, సిరి సంపదలు, ఆనందాలు వెల్లివిరియాలని పేర్కొన్నారు. సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండి రైతులకు అంతా మంచి జరగాలన్నారు. సీఎం జగన్ పాలనలో సకల వృత్తుల వారు ఆనందంగా ఉంటూ ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు.

బాలలకు ఆరోగ్యం.. చక్కగా విద్యాభ్యాసం



విద్యార్థులకు రాగి జావ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

- రాగి జావతో విద్యార్థులకు ఎంతో మేలు
- పంపిణీని ప్రారంభించిన కలెక్టర్

తుమ్మపాల: పిల్లల ఆరోగ్యానికి రాగి జావ ఎంతో మేలు చేస్తుందని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అన్నారు. జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా కలెక్టరేట్‌లో రాగి జావ పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. విద్యార్థులకు రాగి జావను పంపిణీ చేశారు. సీఎం క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి వర్చువల్ విధానంలో నిర్వహించిన కార్యక్రమాన్ని విద్యార్థులతో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాగి జావలో ప్రొటీన్లు, కాల్షియం, ఐరన్ లభించి మంచి శక్తి ఇస్తుందన్నారు. బాలికల్లో రక్తహీనత నివారణకు దోహదపడుతుందన్నారు. ఆరోగ్యం చక్కగా ఉంటే చిన్నారులు చదువుపై దృష్టి పెట్టగలుగుతారన్నారు. జిల్లాలో 1,435 పాఠశాలల్లో లక్షా 24 వేల 747 మంది విద్యార్థులు జగనన్న గోరుముద్ద పథకంతో లబ్ధి పొందుతున్నారన్నారు. రాగి జావ పంపిణీకి ప్రభుత్వం ప్రతి నెల రూ.2.8 కోట్లు వెచ్చిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి వెంకటలక్ష్మమ్మ, డిప్యూటీ డీఈవో ప్రేమ్‌కుమార్, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ అజయ్‌బాబు, బీసీ సంక్షేమ శాఖ డీడీ రాజేశ్వరి, గిరిజన సంక్షేమ శాఖ ఏటీడబ్ల్యువో నాగశిరీష, విద్యార్థులు పాల్గొన్నారు.

ఐదుగురు సీఐల బదిలీ

సాక్షి, విశాఖపట్నం: విశాఖ రేంజ్ పరిధిలో పలువురు సీఐలను బదిలీ చేస్తూ డీఐజీ హరికృష్ణ ఉత్తర్వులు జారీ చేశారు. విశాఖ వీఆర్‌లో ఉన్న పి.పైడపునాయుడిని అనకాపల్లి పీసీఆర్‌గా, ఎం.బుచ్చిరాజును విజయనగరం సీసీఎస్‌కి, బి.నాగేశ్వరావును విజయనగరం దిశ పోలీస్‌స్టేషన్ పీఎస్‌కి, బి.వి.వెంకటేశ్వరరావును శ్రీకాకుళం సీసీఎస్‌కి బదిలీ చేశారు.

వారు మంగళవారం బదిలీ అయినచోట విధుల్లో చేరారు. వీరితోపాటు విజయనగరం సీసీఎస్‌గా ఉన్న ఎస్.కాంతారావును విశాఖ వీఆర్‌కి బదిలీ చేశారు.

అమ్మా.. బాగున్నారా?



మద్యానికి దూరంగా ఉన్న వ్యక్తి కుటుంబ సభ్యుల యోగక్షేమాలు తెలుసుకుంటున్న జేసీ కల్పన

మునగపాక: అమ్మా.. ఎలా ఉన్నారు? మీవారు ఇంటికి సక్రమంగా వస్తున్నారా.. మిమ్మల్ని బాగా చూసుకుంటున్నారా.. అంటూ జాయింట్ కలెక్టర్ కల్పనాకుమారి పలకరించారు. మద్యం వ్యసనం మాన్పించేందుకు జేసీ 'విముక్తి' అనే ప్రాజెక్టును మునగపాక మండలంలో ప్రయోగాత్మకంగా చేపట్టిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా మద్యం విడిచిపెట్టిన ఇద్దరు వ్యక్తులు పాటిపల్లి గ్రామంలో ఉన్నారు. భూముల రీసర్వే సమీక్ష కోసం మంగళవారం మండలానికి వచ్చిన జేసీ.. పాటిపల్లిలో ఆ ఇద్దరు వ్యక్తుల ఇంటికి వెళ్లి, వారి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. మద్యం మానేశాక వారి ఇంటి పెద్దలో వచ్చిన మార్పు, ఇప్పటికీ అదే పరివర్తన కొనసాగుతోందా.. తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. పిల్లల్ని పలకరించారు. వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వారింట్లో ఫొటో ఆల్బమ్ చూస్తూ పాత జ్ఞాపకాల గురించి వారితో ముచ్చటించారు. 'విముక్తి' పైలట్ ప్రాజెక్టు విజయవంతానికి కృషి చేసిన ఏఎన్ఎం సుజాతను ఈ సందర్భంగా జేసీ అభినందించారు. ఓ పెద్ద కూతురిలా తమ ఇంటికి వచ్చి అంత పెద్ద ఐఏఎస్ అధికారి తమ మంచి చెడ్డలను వాకబు చేయడంతో ఆ ఇంటివారు ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయ్యారు.

సర్వేయర్ సస్పెన్షన్

మునగపాక: భూముల రీ సర్వేలో నిర్లక్ష్యం వహించిన పాటిపల్లి సచివాలయ సర్వేయర్ ఎ.శ్రావణిని జాయింట్ కలెక్టర్ కల్పనాకుమారి మంగళవారం సస్పెండ్ చేశారు. పాటిపల్లిలో జరుగుతున్న రీ సర్వే పనులను పరిశీలించేందుకు వచ్చిన జేసీ అనేక లోటుపాట్లను గమనించారు. విధి నిర్వహణలో విఫలమైన సంబంధిత సర్వేయర్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ చర్యలకు ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం శాశ్వత భూ హక్కు-భూ రక్ష కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడితే కొంత మంది అధికారులు నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. ఆమె వెంట మండల సర్వేయర్ శ్రీనివాసరావు, ఆర్ఐ రమేష్ తదితరులున్నారు. అంతకుముందు మునగపాక రెవెన్యూ కార్యాలయానికి చేరుకున్న ఆమె మండలవ్యాప్తంగా అమలవుతున్న రీ-సర్వేకు సంబంధించి వీఆర్వోలతో సమావేశమయ్యారు. గ్రామాలవారీగా ఇంతవరకు ఎంత మేర సర్వే జరిగిందనే విషయమై సమీక్ష చేశారు.

ఆవ, తోటకూర గింజలతో కళాకృతి



రవికుమార్ తయారు చేసిన చిత్రం

మాకవరపాలెం: కాదేదీ కళకు అనర్హం అనుకోవాలేమో..! తోటకూర గింజలు, ఆవ గింజలతో అద్భుత చిత్రాలు రూపుదిద్దుకున్నాయి. ఉగాది సందర్భంగా మండలంలోని తూటిపాలకు చెందిన మైక్రో ఆర్టిస్ట్ రవికుమార్ తోటకూర, ఆవగింజలతో రామచిలుక, మహిళ, కోయిల చిత్రాలను రూపొందించాడు. వీటి కోసం 7,250 తోటకూర గింజలు, 548 ఆవగింజలను వినియోగించినట్టు తెలిపాడు.

ఎఫ్‌ఎం బాబాయ్‌కి సత్కారం



ఎఫ్‌ఎం బాబాయ్ త్రినాథస్వామిని సత్కరిస్తున్న గవర కార్పొరేషన్ చైర్మన్ ప్రసాద్, డాక్టర్ సతీష్‌కుమార్

మునగపాక: కళాకారులను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ అన్నారు. వాడ్రాపల్లికి చెందిన సీనియర్ కళాకారుడు ఎఫ్‌ఎం బాబాయ్ త్రినాథస్వామిని మునగపాకలో సోమవారం రాత్రి నందీశ్వర తులసీ కళావేదికపై ఘన సత్కరించారు. గ్రామీణ యువజన సాంస్కృతిక సంస్థ కన్వీనర్ సూరిశెట్టి రమణ ఆధ్వర్యంలో నిర్వహించిన సన్మాన కార్యక్రమానికి హాజరైన ప్రసాద్ మాట్లాడుతూ ఎఫ్‌ఎం బాబాయ్‌గా గుర్తింపు పొందిన త్రినాథస్వామి పలు చిత్రాల్లో నటించడంతో పాటు పరిషత్ నాటకాల్లో తన ప్రతిభ చూపుతున్నారన్నారు. డాక్టర్ సతీష్‌కుమార్ మాట్లాడుతూ త్రినాథస్వామి తన జీవితాన్ని కళారంగానికి అంకితం చేశారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దిమ్మల అప్పారావు, జెడ్పీటీసీ స్వామి సత్యనారాయణ,వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి ఆడారి కాశీబాబు,కళాకారులు విల్లూరి జగ్గప్పారావు,మళ్ల కృష్ణ,పెంటకోట రాము,ఆడారి శేఖర్,దశావతారం ,లీలా భాస్కరరావు పాల్గొన్నారు.

రూ.75కి టీటీడీ తెలుగు పంచాంగాలు

ఎంవీపీ కాలనీ(విశాఖ): తిరుమల తిరుపతి దేవస్థానం అందుబాటులోకి తెచ్చిన తెలుగు పంచాంగాలను రూ.75కు విక్రయిస్తున్నట్లు టీటీడీ మేనేజర్ బి.హైమావతి వెల్లడించారు. ఈ మేరకు పంచాంగ ప్రతులను మంగళవారం ఎంవీపీ కాలనీలోని టీటీడీ కల్యాణ మండపంలో ఆవిష్కరించారు. అనంతరం విక్రయాలు ప్రారంభించారు. స్టాక్ ఉన్నంత వరకు ఉదయం నుంచి టీటీడీ కల్యాణ మండపం వద్ద విక్రయిస్తామని హైమావతి వెల్లడించారు.

డోర్ టు డోర్ కార్గో సేవలు

- ఉగాది నుంచి అమలుకు సన్నద్ధం
- షిప్‌మంత్ర లాజిస్టిక్స్‌తో ఆర్టీసీ ఒప్పందం
- ఇంటి నుంచే ఆన్‌లైన్‌లో బుక్ చేసుకునే సదుపాయం
- ప్రైవేటు పార్శిల్ సంస్థలకంటే తక్కువ డెలివరీ చార్జీలు



విశాఖ ద్వారకా బస్‌స్టేషన్‌లో పార్శిల్ రవాణా కార్యాలయం

సాక్షి, విశాఖపట్నం: కార్గో సేవల్లో ఆర్టీసీ దూకుడు ప్రదర్శిస్తోంది. ఇప్పటికే వినియోగదారుల ఆదరణతో దూసుకుపోతున్న ఈ కార్గో ఇప్పుడు వారికి మరింత చేరువకానుంది. ఉగాది నుంచి పార్శిల్స్, కొరియర్స్, 50 కిలోల లోపు బరువున్న సరకులు/వస్తువులను 20 కిలోమీటర్ల పరిధిలో డోర్ పికప్, డెలివరీ చేయడానికి సన్నద్ధమవుతోంది. ఇందుకోసం షిప్‌మంత్ర అనే లాజిస్టిక్స్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. తొలిదశలో ప్రయోగాత్మకంగా విజయవాడ–విశాఖపట్నం నగరాల మధ్య ఈ సేవలను అందుబాటులోకి తెస్తోంది. ఇకపై ఎవరైనా ఆర్టీసీ కార్గో ద్వారా పార్శిల్స్ లేదా కొరియర్ కవర్లను పంపాలనుకున్న వారు తమ ఇంటి నుంచే వాటిని 'షిప్‌మంత్ర ఆన్‌లైన్ బుకింగ్ పోర్టల్' ద్వారా బుక్ చేసుకునే సదుపాయాన్ని కల్పిస్తున్నారు. దీని ద్వారా డోర్ పికప్, డెలివరీ సదుపాయాన్ని పొందవచ్చు. ప్రారంభ కానుకగా ఈ నెల 31 వరకు మొదటి మూడు బుకింగ్‌లకు ఉచిత డోర్ పికప్, డోర్ డెలివరీ సౌకర్యాన్ని కార్గో వినియోగదారులకు ఆర్టీసీ యాజమాన్యం కల్పిస్తోంది. ఇలా సంబంధిత షిప్‌మంత్ర లాజిస్టిక్స్‌కు చెందిన వ్యక్తులు డోర్ పికప్, డెలివరీ సేవలందిస్తారు. వాటిని ఆర్టీసీ కార్గో బుకింగ్ కౌంటర్‌లో అందజేస్తారు. అక్కడ నుంచి నిర్ణీత ప్రాంతాలకు పంపిస్తారు. వాటిని ఏ బస్సులో పంపిస్తున్నారో ఆర్టీసీ కార్గో విభాగం నుంచి షిప్‌మంత్రకు పంపిస్తారు. అక్కడ నుంచి నిర్దేశిత చిరునామాకు డెలివరీ చేస్తారు. ఇందుకుగాను స్వల్పంగా రుసుము వసూలు చేస్తారు. వీటి చార్జీలను నేడో, రేపో ఖరారు చేయనున్నారు. కొత్తగా ప్రవేశపెడుతున్న ఈ సదుపాయం వల్ల వినియోగదారునికి తక్కువ ఖర్చుతోనే తమ సరకులు/పార్శిళ్లను ఇంటి నుంచే పంపించుకునే వెసులుబాటు కలుగుతుంది.

కార్గో జోన్ లక్ష్యం రూ.64 కోట్లు

ఆర్టీసీ విజయనగరం కార్గో జోన్ పరిధిలో విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాలున్నాయి. ఈ జోన్ కార్గో ద్వారా 2022–23 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు రూ.21 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. కొత్తగా కార్గో డోర్ డెలివరీ సదుపాయాన్ని విస్తరిస్తున్న నేపథ్యంలో 2023–24 సంవత్సరానికి కార్గో రాబడి లక్ష్యం రూ.64 కోట్లుగా నిర్దేశించారు. ఇతర లాజిస్టిక్స్‌కంటే ఆర్టీసీ కార్గో రవాణా చార్జీలు తక్కువగా ఉండడం, డోర్ పికప్, డెలివరీ సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకొస్తుండడం లాజిస్టిక్స్ ఆదాయం పెరుగుతుందని ఆర్టీసీ వర్గాలు భావిస్తున్నాయి.

డోర్ పికప్, డెలివరీకి ఆదరణ



ఉగాది నుంచి కొత్తగా ప్రవేశపెడుతున్న కార్గో డోర్ పికప్, డెలివరీ సదుపాయానికి మంచి ఆదరణ ఉంటుంది. ఇప్పటికే ఆర్టీసీ కార్గోపై వినియోగదారుల్లో విశ్వసనీయత ఉంది. రాష్ట్రంలో 24 గంటల్లోనే సరకును చేరవేయడం, ప్రైవేటు లాజిస్టిక్స్‌కంటే 25 శాతం తక్కువ.. 2016 నాటి చార్జీలే ఇప్పటికీ వసూలు చేయడం వంటివి ఆర్టీసీకి కలిసొచ్చే అంశం. – కె.వెంకట్రావు, డీసీఎం, విజయనగరం జోన్

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



తారువలో సూరిబాబు కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న డిప్యూటీ సీఎం బూడి

దేవరాపల్లి: ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్) నిరుపేదల పాలిట సంజీవనిగా నిలుస్తోందని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. ఓ ప్రమాదంలో గాయపడిన తారువ గ్రామానికి చెందిన రాయపురెడ్డి సూరిబాబుకు మంజూరైన రూ.10 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అతని కుటుంబ సభ్యులకు మంగళవారం క్యాంప్ కార్యాలయంలో ఆయన అందజేశారు. సూరిబాబు స్టీల్ ప్లాంట్‌లో కాంట్రాక్ట్ కార్మికుడిగా పని చేస్తున్నాడు. గత నెల 11న స్టీల్ ప్లాంట్‌లో జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందాడు. దీంతో ఆయన కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటోంది. డిప్యూటీ సీఎం ప్రత్యేక చొరవతో సూరిబాబుకు రూ.10 లక్షలు మంజూరైంది. తమ కుటుంబానికి అండగా నిలిచిన డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడుకు సూరిబాబు, అతని కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఉప సర్పంచ్ బూడి సూర్యానారాయణ, మాజీ ఎంపీటీసీ మలిరెడ్డి మహాలక్ష్మి నాయుడు పాల్గొన్నారు.

పెద్దేరు ఆధునికీకరణతో చోడవరానికి మేలు

ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



చోడవరం: పెద్దేరు రిజర్వాయర్ ఆధునికీకరణకు ప్రభుత్వం ఇటీవల రూ.84.40 కోట్లను మంజూరు చేసిందని, దీనివల్ల చోడవరం నియోజకవర్గంలో 12వేల ఎకరాలకు సాగునీటి సౌకర్యం మెరుగుపడుతుందని ప్రభుత్వ విప్, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ మంగళవారం తెలిపారు. వ్యవసాయానికి, రైతుల సంక్షేమానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. సుమారు 14 ఏళ్లుగా పెద్దేరు రిజర్వాయర్ కుడి, ఎడమ కాల్వల ఆధునికీకరణకు నిధులు మంజూరుకాక, చివరి ఆయకట్టుకు నీరందక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇలాంటి పరిస్థితిలో ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి చొరవ తీసుకొని ఈ రిజర్వాయర్ కాల్వల ఆధునికీకరణ పనులకు రూ. 84.40 కోట్లు నిధులు మంజూరు చేశారని ధర్మశ్రీ తెలిపారు. రిజర్వాయర్ ఆయకట్టు పరిధిలో లేని బుచ్చెయ్యపేట మండలంలో దిబ్బిడి, పి.భీమవరం గ్రామాల పరిధిలో ఉన్న భూములకు కూడా ఈకాల్వ నీరు అందించాలని ముఖ్యమంత్రిని కోరామని, ఆయన సుముఖత వ్యక్తం చేశారన్నారు. ఈ గ్రామాలు కూడా కలిస్తే మరో 4వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. గత టీడీపీ ప్రభుత్వం పూర్తిగా సాగునీటి ప్రాజెక్టులను,రైతులను విస్మరించిందని, టీడీపీ ఐదేళ్ల పాలనలో కనీసం రూ.కోటి కూడా ఆధునీకరణ పనులకు మంజూరుకాలేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏకంగా రూ. 84.40 కోట్లు మంజూరు చేసి రైతు పక్షపాతిగా నిలిచిందని ధర్మశ్రీ చెప్పారు. ఆధునీకరణకు నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ఈ సందర్భంగా ధర్మశ్రీ కృతజ్ఞతలు తెలిపారు. ఇందుకు సహకరించిన ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, భారీ నీటి పారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబుకు ధర్మశ్రీ కృతజ్ఞతలు తెలిపారు.

తమ్ముడిపై హత్యాయత్నం చేసిన అన్నకు రెండేళ్ల జైలు

చోడవరం రూరల్ : ఆస్తి కోసం సొంత తమ్ముడిపై హత్యాయత్నానికి పాల్పడిన అన్నకు రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ చోడవరం అసిస్టెంట్ సెషన్స్ జడ్జి సత్తి అరుణశ్రీ మంగళవారం తీర్పు చెప్పారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన కేసుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. పాడేరు మండలం ఆడారిమెట్ట గ్రామానికి చెందిన సీదరి రామారావు ఫిర్యాదు ప్రకారం తన అన్న సీదరి బాలన్న తమ గ్రామంలోని ఆంజనేయస్వామి గుడి దగ్గర ఉన్న సర్వే నంబర్ 1–బిలో ఉన్న 52 సెంట్ల భూమి విషయమై గొడవకు దిగి కత్తితో తలపై నరికి హత్యాయత్నానికి ప్రయత్నించాడు. తలపై గాయంతో రామారావు పాడేరు ఆస్పత్రిలో చేరగా అతడి వాంగ్మూలం మేరకు పాడేరు ఎస్‌ఐ జి.లక్ష్మణరావు కేసు నమోదు చేశారు. నిందితుడు బాలన్నపై ఐపీసీ 307 సెక్షన్ ప్రకారం కేసు నమోదు చేసి నేర అభియోగపత్రం దాఖలు చేశారు. 2021 ఆగస్టు 31వ తేదీన నమోదైన కేసు పూర్వాపరాలను పరిశీలించిన మీదట నిందితుడు బాలన్నపై మోపిన అభియోగం రుజువు కావడంతో రెండేళ్ల కఠిన కారాగార శిక్ష, 500 రూపాయల జరిమానా విధిస్తూ చోడవరం అసిస్టెంట్ సెషన్స్ జడ్జి సత్తి అరుణశ్రీ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున అడిషనల్ పీపీ వేచలపు వెంకటరావు తన వాదనలు వినిపించారు.

డీసీసీబీ డైరెక్టర్‌గా అంకంరెడ్డి పార్వతి



పార్వతిని డైరెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం జారీ చేసిన పత్రాన్ని చూపుతున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: డీసీసీబీ డైరెక్టర్‌గా అంకంరెడ్డి పార్వతిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్టు డీసీసీబీ చైర్‌పర్సన్ చింతకాయల అనిత తెలిపారు. నాతవరం మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు అంకంరెడ్డి జమీలు డీసీసీబీ డైరెక్టర్‌గాపనిచేస్తూ ఇటీవల మరణించారు. జమీలు స్థానంలో ఆయన సతీమణి పార్వతిని డీసీసీబీ డైరెక్టర్‌గా నియమిస్తూ కార్పొరేషన్ అండ్ రిజిస్ట్రార్ ఆఫ్ కో–ఆపరేటివ్ సొసైటీ ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవి చౌదరి ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు.

పార్టీ కోసం పనిచేసేవారికి గుర్తింపు

అంకంరెడ్డి జమీలు స్థానంలో ఆయన సతీమణి పార్వతిని డీసీసీబీ డైరెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం తగిన గుర్తింపు ఇచ్చిందని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. జమీలు మరణించిన వెంటనే నాతవరం పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జిగా పార్వతిని నియమించామన్నారు. డీసీసీబీ డైరెక్టరుగా అవకాశమివ్వాలని వ్యవసాయశాఖ మంత్రిని కోరామని, మొదట్లో సాంకేతిక సమస్య కారణంగా, తర్వాత ఎన్నికల కోడ్ కారణంగా కొంత జాప్యం జరిగినా.. చివరకు న్యాయం జరిగిందన్నారు. జమీలు కుటుంబానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తగిన గుర్తింపు ఇచ్చారన్నారు. పార్టీ కోసం పనిచేసే వారికి గుర్తింపు ఉంటుందన్నారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి



కశింకోట వద్ద మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

కశింకోట : కశింకోట రైల్వేస్టేషన్ సమీపంలో మంగళవారం రైలు ఢీకొని గుర్తు తెలియని 60 ఏళ్ల వయసున్న వ్యక్తి మృతి చెందినట్టు దువ్వాడ రైల్వే ఎస్‌ఐ శాంతారాం తెలిపారు. అనకాపల్లి నుంచి యలమంచిలి వైపు వెళుతున్న మార్గంలో కశింకోట రైల్వే గేటు సమీపంలో గుర్తు తెలియని రైలు ఢీకొని వెళ్లిపోవడంతో ఈ సంఘటన జరిగిందన్నారు. మృతుడు తెలుపు, నీలం రంగు గీతల ఫుల్ హేండ్ షర్టు, లుంగీ, ఆర్మీ యూనిఫారం హాఫ్ నిక్కరు ధరించి ఉన్నట్టు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని, బంధువులు ఉంటే తమను గాని, రైల్వే పోలీసుస్టేషన్‌లో గాని 7673906010 నంబర్లో సంప్రదించాలని కోరారు.

నిరుద్యోగులకు వరం పీఎంఈజీపీ

ఏపీ ఖాదీ, గ్రామీణ పరిశ్రమల మండలి ఏడీ డాక్టర్ పద్మ



సమావేశంలో మాట్లాడుతున్న ఖాదీ, గ్రామీణ పరిశ్రమల మండలి ఏడీ డాక్టర్ పద్మ

అనకాపల్లి రూరల్ : నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి ఉపాధి కల్పన పథకం(పీఎంఈజీపీ)ను అమలు చేస్తోందని, నిరుద్యోగులకు ఈ పథకం ఒక వరమని ఏపీ ఖాదీ, గ్రామీణ పరిశ్రమల మండలి అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ వి.పద్మ అన్నారు. మంగళవారం అనకాపల్లి మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఖాదీ బోర్డు ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహనా సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరుద్యోగులు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో చిన్న తరహా పరిశ్రమల ద్వారా వ్యాపారవేత్తలుగా ఎదగడానికి ఈ పథకం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. చిన్న పరిశ్రమల ఏర్పాటు ద్వారా మరి కొంతమందికి ఉపాధి కల్పించవచ్చన్నారు. బ్యాంకులు పీఎంఈజీపీ ద్వారా లబ్ధిదారులకు రుణాలిస్తాయని, వీటిలో 35 శాతం సబ్సిడీ ఉంటుందన్నారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి, అనకాపల్లి లీడ్‌బ్యాంక్ మేనేజర్ సత్యనారాయణ, ఖాదీ బోర్డు ఇన్‌స్పెక్టర్ సురేష్, బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజర్ కిషోర్, కెనరా బ్యాంకు మేనేజర్ విజయ్‌కుమార్, డీఐసీ ఏడీ జోగినాథం తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు వద్ద మరొకరు..



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

రోలుగుంట : కుసుర్లపూడి గ్రామం వద్ద మంగళవారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో ఎస్‌ఐ బి.నాగకార్తీక్ గ్రామానికి వెళ్లి దర్యాప్తు చేస్తున్నారు. స్థానికులు తెలిపిన వివరాలివి. సుమారు పది రోజులుగా ఈ వ్యక్తి కుసుర్లపూడి గ్రామంలో తిరుగుతూ ఎవరైనా పెట్టింది తిని గ్రామంలోనే ఉంటున్నాడు. ఎవరైనా అడిగితే తనది మాడుగుల అని చెప్పడం మినహా కచ్చిత సమాచారం లేదు. అతను మంగళవారం గ్రామానికి చెందిన డంపింగ్ యార్డు వద్ద మృతిచెంది పడి ఉన్నాడు. దీంతో మృతదేహాన్ని నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించి మార్చురిలో భద్రపరిచినట్టు ఎస్‌ఐ తెలిపారు. మృతుని వివరాలు తెలిసిన వారు ఫోన్ నంబరు 9440796080కు సమాచారం తెలియజేయాలని కోరారు.

పలు ప్రాంతాల్లో భారీ వర్షం



వడ్డాది డైవర్షన్ రోడ్డు వద్ద నీట మునిగిన గొట్టాలు



శంకరంలో నేలకొరిగిన అరటితోట

దేవరాపల్లి: మండలంలో మంగళవారం భారీ వర్షం కురిసింది. రైవాడ అతిథి గృహం వద్ద 2.8 సెంటీమీటర్ల వర్ష పాతం నమోదైంది. పొలాల్లోకి నీరు చేరింది. ఈ వర్షాల వల్ల జీడి,మామిడి, చింత, అరటి పంటలకు నష్టం వాటిల్లుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నేలకొరిగిన అరటి చెట్లు

మాడుగుల రూరల్: మండలంలో సోమవారం కురిసిన వర్షం, వీచిన ఈదురు గాలులకు శంకరం పంచాయతీ పరిధిలో గల కృష్ణంపాలెం, శంకరం గ్రామాల్లో అరటి తోటలు పూర్తిగా నేలకొరిగాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. తమకు పరిహారం అందజేయాలని బాధిత రైతులు ముమ్మ సురేష్, కురపా బాలరాజు, కురపా ఈశ్వరావు,దాడి నారాయణరావు, బొబ్బిలి నాయుడు తదితరులు కోరారు. జనుము పంట కూడా నేలమట్టమైందని అన్నదాతలు తెలిపారు.

బుచ్చెయ్యపేటలో

బుచ్చెయ్యపేట : మండలంలో కురుస్తున్న వర్షాలకు పలు గ్రామాల్లో చెట్లు నేలకొరిగాయి. విద్యుత్ స్తంభాలు,ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతినడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. జీడిమామిడి కాయలు నేలరాలి కొంత నష్టం జరిగింది. వడ్డాదిలో నిర్మాణంలో ఉన్న డైవర్షన్ రోడ్డు పనులకు ఆటంకం కలిగింది. పెద్దేరు నదిలో నీటి ప్రవాహం పెరిగింది. డైవర్షన్ రోడ్డుకోసం వేస్తున్న గొట్టాలునీట మునిగిపోగా, ప్లాట్ ఫాం నీటిలో మునిగి దెబ్బతింది.

ఆలయం వద్ద చైన్ స్నాచింగ్

నర్సీపట్నం : పట్టణంలోని నూకాలమ్మ ఆలయం వద్ద అమ్మవారి దర్శనానికి వచ్చిన మహిళ మెడలో గుర్తు తెలియని వ్యక్తి చైన్ స్నానింగ్‌కు పాల్పడ్డాడు. బాధితురాలి కథనం ప్రకారం వివరాలివి. మున్సిపాలిటీ పరిధి వెంకునాయుడుపేటకు చెందిన పి.సత్యవతి అమ్మవారిని దర్శించుకునేందుకు అబిద్‌సెంటర్‌లోని ఆలయానికి వచ్చారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండడాన్ని గమనించిన గుర్తు తెలియని వ్యక్తి ఆమె మెడలో బంగారు గొలుసు తెంపుకొని పరారయ్యాడు. మూడున్నర తులాల బంగారం తాడు పోవడంతో ఆమె లబోదిబోమంటున్నారు. గట్టి బందోబస్తు ఉన్నప్పటికీ అమ్మవారి ఆలయం వద్ద చైన్ స్నానింగ్ జరగడం పట్ల భక్తులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై పోలీసులను సంప్రదించగా తమకు ఎటువంటి ఫిర్యాదు రాలేదంటున్నారు.

అదుపు తప్పి లారీ బోల్తా



రోడ్డుపై బోల్తాపడిన లారీ

ఎస్.రాయవరం : పి.ధర్మవరం సమీపంలో జాతీయరహదాపై వరహానది బ్రిడ్జిపై మంగళవారం లారీ అదుపుతప్పి బోల్తా పడి, ముగ్గురు కూలీలకు గాయాలయ్యాయి. ఈ మేరకు ఎస్‌ఐ ప్రసాద్‌రావు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి.యలమంచిలి వైపు నుంచి అడ్డురోడ్డు వైపు సిమ్మెంట్ పలకల లోడుతో వెలుతున్న లారీ అదుపుతప్పి బోల్తాపడింది. ఈ లారీపై ప్రయాణిస్తున్న శివప్రసాద్, డెబీష్, శంకర్ లకు గాయాలయ్యాయి.ఇందులో శివప్రసాద్ కాలు విరిగి తీవ్రంగా గాయపడినట్టు నక్కపల్లి ప్రభుత్వ ఆసుపత్రి వైద్య సిబ్బంది తెలిపారు. ఈ లారీ బోల్తాపడిన సమయంలో సుమారు 20 నిమిషాలు పాటు ట్రాఫిక్ సమస్య తలెత్తింది. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ ప్రసాద్‌రావు సిబ్బందితో వెళ్లి ట్రాఫిక్ సమస్యను క్లీయర్ చేశారు. గాయపడిన వారు నక్కపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్టు చెప్పారు. లారీ ఓనరు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని చెప్పారు.

పూటుగా మద్యం సేవించి వ్యక్తి మృతి

అనకాపల్లిటౌన్ : పూటుగా మద్యం సేవించి వ్యక్తి మృతి చెందాడు. పట్టణ ఎస్‌ఐ వి.సత్యనారాయణ అందించిన వివరాలిలా ఉన్నాయి. కూర్మన్నపాలెం పెదయాతపాలేనికి చెందిన పట్నాల నూకరాజు(32) వృత్తిరీత్యా మచిలీపట్నం బందర్ సెలూన్‌షాపులో పని చేస్తున్నాడు. బందరు నుంచి రెండురోజుల క్రితం స్వగ్రామం పెదయాతపాలేనికి ఉగాది పండగకు బయల్దేరాడు. ప్రయాణంలో నూకరాజు అతిగా మద్యం సేవించి స్థానిక జాతీయ రహదారిపై మృతి చెంది పడి ఉన్నాడు. మృతదేహం గురించి సమాచారం అందడంతో ఎస్‌ఐ మంగళవారం ఘటనాస్థలికి వెళ్లి మృతుని సెల్‌ఫోన్ నుంచి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. నూకరాజు అత్త ఆదిలక్ష్మి వచ్చి మృతుడు తన అల్లుడేనని గుర్తించింది. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించినట్టు ఎస్‌ఐ చెప్పారు.

క్లుప్తంగా

కనకమహాలక్ష్మికి ఉగాది పూజలు నేడు



కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయం

కశింకోట : కశింకోటలోని కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ఉగాది పర్వదినం పురస్కరించుకుని బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు ఆలయ అర్చకులు వి.శంకరం, వి.చిదంబరం, వి.కృష్ణ మంగళవారం తెలిపారు. ఉదయం అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహిస్తామన్నారు.

ఉగాది పంచాంగ శ్రవణం నేడు

కశింకోట : మండలంలోని పలు రామాలయాల్లో బుధవారం ఉగాది పురస్కరించుకుని పంచాంగ శ్రవణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు సదరు ఆలయాల నిర్వాహకులు తెలిపారు. స్థానిక గవరపేట, కస్పావీధి, కనకమహాలక్ష్మి వీధి, పూసర్లవీధి తదితర ప్రాంతాల్లో ఉన్న రామాలయాల్లో పంచాంగ శ్రవణాలకు ఏర్పాట్లు చేశారు. రాశి ఫలాలు, శుభ ఫలితాలు, వర్షాలు ఎప్పుడు పడతాయి, ఈ ఏడాది ఏ పంటలు అనుకూలం తదితర అంశాలపై పండితులు వివరిస్తారని నిర్వాహకులు వెల్లడించారు.

చిరుధాన్యాలతో దీర్ఘకాలిక వ్యాధులు దూరం



సదస్సులో మాట్లాడుతున్న లక్ష్మీపతి

అనకాపల్లిటౌన్ : చిరుధాన్యాలు తీసుకోవడం ద్వారా దీర్ఘకాలిక వ్యాధులను దూరం చేయవచ్చని డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి అన్నారు. గవరపాలెం పల్లపువీధి ప్రైమరీ స్కూల్లో మంగళవారం చిరుధాన్యాలపై అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పాలిష్ పెట్టిన బియ్యంలో చక్కెరశాతం ఎక్కువగా ఉంటుందని, అలాంటి బియ్యం తింటే సుగర్ వ్యాధి సంక్రమిస్తుందన్నారు. సీడీపీవో కె.ప్రభావతి మాట్లాడుతూ మార్చి 20 నుంచి ఏప్రిల్ 3 వరకు చిరుధాన్యాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఏపీఎం పద్మావతి, వైఎస్సార్‌సీపీ 80వ వార్డు ఇన్‌చార్జి కొణతాల భాస్కరరావు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు సోమవారం 4,012 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,600	4,000
మొదటి రకం	3,630	3,830
రెండో రకం	3,410	3,620
మూడోరకం	3,150	3,400

అనకాపల్లి సినిమాలు

సార్	రాజా
కోస్టి	సత్యనారాయణస్క్రీన్-1
మనసిస్తావా	సత్యనారాయణస్క్రీన్-2
కబ్జా	షిర్డిసాయి
బలగం	పర్తిసాయి
రంగమార్తాండ	వెంకటేశ్వర
పులి	శ్రీసత్య
దాస్ కా ధమ్కీ	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 24 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-3 యూనిట్లు, ఏ నెగిటివ్-1 యూనిట్, బీ పాజిటివ్-12 యూనిట్లు, బీ నెగిటివ్-1 యూనిట్, ఓ పాజిటివ్-6 యూనిట్లు, ఓ నెగిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 367 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 423 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

ఘనంగా కొత్త అమావాస్య వేడుకలు



కర్రి పెద్దయ్య వీధిలో పూజలందుకుంటున్న నూకాంబిక అమ్మవారు



నూకాంబిక అమ్మవారి సన్నిధిలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు సంప్రదాయ సత్కారం

అనకాపల్లి టౌన్ : స్థానిక తాకాశివీధి నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య వేడుకలు కన్నులపండువగా జరిగాయి. అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి కుంకుమ పూజలు నిర్వహించారు. అమ్మవారి దర్శనానికి భక్తులు పెద్దసంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ తాకాశి రాజేష్, కమిటీ సభ్యులు బేతి ఈశ్వరరావు, తాకాశి కృష్ణ, తాకాశి నాగేష్, తాకాశి విస్సు, తాకాశి సత్యందొర, గంగుపాం మహేష్‌దొర, కారుకుండి కన్నా పాల్గొన్నారు.

కశింకోట : కశింకోటలో కొత్త అమావాస్య ఉత్సవాల సందర్భంగా నూకాంబిక అమ్మవారి సారె ఊరేగింపు ఘనంగా జరిగింది. వెలమ సంక్షేమ సంఘం, చౌడేశ్వరి దేవాంగుల సంక్షేమ సంఘాల ఆధ్వర్యంలో వేర్వేరుగా ఉదయం, సాయంత్రం సారె ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రదక్షిణ చేసి అగ్ని గుండాలు తొక్కి అమ్మవారిని దర్శించుకున్నారు. దేవాంగుల సంక్షేమ సంఘం నుంచి కస్పావీధిలో వివిధ తీపి పదార్థాలు, పండ్లతో కూడిన సారెను తలపై పెట్టుకుని ఆలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. స్థానికులతోపాటు విశాఖ, గాజువాక తదితర సుదూర ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చారు. అమ్మవారికి చీరలు, రవికలు, అరటి గెలలు, తలనీలాల రూపంలో మొక్కులు సమర్పించారు. రాత్రి అమ్మవారి జాతర ఊరేగింపు జరిగింది. అమ్మవారి గరగలు, ప్రభలను ఊరేగించారు. అమ్మవారికి మహా నైవేద్యం సమర్పించారు. పూజల్లో ఆలయ ధర్మకర్తలు వేగి శివ గణేష్, వేగి రామరాజు, వేగి రమణబాబు, వేగి సత్తిబాబు పాల్గొన్నారు.

- ఉగ్గినపాలెంలో నూకాంబిక అమ్మ వారిని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ దర్శించుకుని, పూజలు చేశారు. ఎంపీపీ కలగా లక్ష్మి, సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు మంత్రికి దుశ్శాలువా, జ్ఞాపిక అందించి సత్కరించారు.
- తాళ్లపాలెంలో నూకాంబిక అమ్మ వారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. సాయంత్రం అగ్ని గుండాలు తొక్కారు. భారీ జాతర నిర్వహించారు.



కశింకోటలోని నూకాంబిక ఆలయంలో పూజలు

ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

- నరసింగబిల్లిలో నూకాంబిక అమ్మవారిని గ్రామంలో ఊరేగించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు ఉదయం నుంచే బారులు తీరారు. పూజలు చేసి చీర, రవిక, అరటి గెలలు తదితర రూపాల్లో మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కె.వి.వి. సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ కోన అరుణ, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు కోన నాగేశ్వరరావు పాల్గొన్నారు.
- నూతలగుంటపాలెంలోని నూకాంబిక ఆలయంలో పూజలు ఘనంగా జరిగాయి. గ్రామ వైఎస్సార్ సీపీ నాయకుడు కలిగెట్ల నాయుడు ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి.
- సోమవరం, కన్నూరుపాలెం, జి.భీమవరం, తేగాడ, వెదురుపర్తి తదితర గ్రామాల్లో కొత్త అమావాస్య ఉత్సవాలు ఘనంగా జరిగాయి.



తాకాశి నూకాంబిక సన్నిధిలో భక్తులు



అరటి గెలలతో వెలమ సంక్షేమ సంఘం సారె ఊరేగింపు



అగ్నిగుండం తొక్కుతున్న భక్తులు

తుమ్మపాల : గవరపాలెం కర్రి పెద్దయ్య వీధిలో నూకాంబిక అమ్మవారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. మొక్కులు తీర్చుకున్నారు. సిద్ధి వినాయక సేవా సంఘం, శ్రీకాకతాంబికా సిండికేట్ ఆధ్వర్యంలో అన్నసమారాధన జరిగింది. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేసి, అమ్మవారికి మహా నైవేద్యం సమర్పించారు.



అమ్మవారికి చౌడేశ్వరి దేవాంగుల సారె ఊరేగింపు

నూకాంబిక అంబలం పూజ



పూజలో అమ్మవారి మాలధారణ భక్తులు

అనకాపల్లిటౌన్ : ఉత్తరాంధ్ర ఇలవేల్పు గవరపాలెం నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతరలో భాగంగా ఆలయంలో సోమవారం రాత్రి అమ్మవారి మాలధారణ సేవాసంఘం ఆధ్వర్యంలో భారీ అంబలంపూజ జరిగింది. సంఘ వ్యవస్థాపకుడు పాలిమేర శ్రీను అమ్మవారి పాటలతో ఆలయం మారుమోగింది. ఈ కార్యక్రమంలో మళ్ల గణేష్, సూరిశెట్టి శ్రీను, కోలపర్తి శ్రీను, సూరిశెట్టి ఉదయ్‌అక్షయరాజ్, పవన్, కృష్ణసాగర్, కొండ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కవిసమ్మేళనం

అనకాపల్లిటౌన్ : స్థానిక శాఖా గ్రంథాలయంలో సాహితీమిత్రులు, తెలుగు బాషా పరిరక్షణ సమితి సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం కవిసమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా సమితి కన్వీనర్ కొయిలాడ రామ్మోహనరావు మాట్లాడుతూ తెలుగు భాషాభిమానం చూసి సమితి కార్యక్రమాల్లో సాహితీమిత్రుల సహకారం తీసుకున్నట్టు తెలిపారు. సీనియర్ కవి మాధవీ సనారా కవితలు ఆకట్టుకున్నాయి. అంతకు ముందు కవులు, కవయిత్రులను సాహితీమిత్రులు సత్కరించారు. కార్యక్రమంలో కవులు జి.రంగబాబు, రాయవరపు సరస్వతి, కోరాడ అప్పలరాజు, శిష్టా తమ్మిరాజు, వజ్రపు త్రినాథరావు, దేవరకొండ లక్ష్మీనారాయణ, భమిడిపాటి కాళిదాసు, గంపా శ్రీదేవి, రేగులగడ్డ వెంకటలక్ష్మి గాయత్రి, అమరజ్యోతి పాల్గొన్నారు.

పేకాడుతున్న ఏడుగురిపై కేసు

కశింకోట : మండలంలోని విస్సన్నపేట గ్రామంలో పేకాటాడుతున్న ఏడుగుర్ని మంగళవారం అదుపులోకి తీసుకున్నట్టు ఎస్‌ఐ ఎ.ఆదినారాయణరెడ్డి తెలిపారు. వారి నుంచి రూ.8,380 నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

నూకాలమ్మకు కొత్త అమావాస్య పూజలు



రహదారిపైకి చేరుకున్న భక్తుల క్యూ



ఆలయ ఆవరణలో తోడపెద్దు సేవ



పట్టువస్త్రాలు తలపై మోసుకొస్తున్న ఆలయ ఈవో చంద్రశేఖర్, జయవీర్

ఉత్తరాంధ్ర ఇలవేల్పు గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయంలో కొత్త అమావాస్య వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయ ఈవో చంద్రశేఖర్, జిల్లా ఖోఖో సంఘం అధ్యక్షుడు జయవీర్ పట్టువస్త్రాలను అమ్మవారికి సమర్పించారు. అమ్మవారి దర్శనానికి భక్తులు భారీ సంఖ్యలో బారులుతీరారు. భక్తుల క్యూ రహదారిపైకి చేరుకుంది.

- అనకాపల్లి టౌన్



ఆలయ ఆవరణలో మహిళల కోలాటం

అలరించిన నాటికలు



పోటీలను ప్రారంభిస్తున్న రత్నాకర్



ది లాస్ట్ జడ్జిమెంట్ నాటికలో సన్నివేశం

అనకాపల్లిటౌన్ : స్థానిక వి.వి.రమణ రైతుభారతి ఓపెన్ ఆడిటోరియంలో జ్యోతిసరళ స్మారక కళా పరిషత్, 1975 ఎంహెచ్ స్కూల్ పూర్వవిద్యార్థుల సహకారంతో జరుగుతున్న ఉమ్మడి ఏపీ ద్వితీయ ఆహ్వాన నాటిక పోటీలు మంగళవారం ప్రేక్షకులను విశేషంగా అలరించాయి. మంగళవారం పోటీల్లో భాగంగా నటరాజ్ ఆర్ట్స్ క్రియేషన్స్ విశాఖ వారు ప్రదర్శించిన ‘ది లాస్ట్ జడ్జిమెంట్’ ఆకట్టుకుంది. ఈ పోటీలను వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళా పరిషత్ కార్యదర్శి పీసీహెచ్ నాయుడు కళాపరిషత్ ఏర్పాటు చేసి గత రెండేళ్లుగా నాటిక పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రైటర్స్ అకాడమీ అధినేత వి.వి.రమణమూర్తి, రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ శిలపరశెట్టి బాబీ, 80వ వార్డు కార్పొరేటర్ కొణతాల నీలిమ భాస్కరరావు, నిర్వాహకులు బొడ్డేడ జగతారావు, కె.ఎం.నాయుడు, భీశెట్టి కృష్ణ అప్పారావు పాల్గొన్నారు.

డైట్‌లో ముందస్తు ఉగాది వేడుకలు



ఉగాది సంబరాల్లో విజేతలతో కళాశాల కరస్పాండెంట్ దాడి రత్నాకర్, సిబ్బంది

అనకాపల్లిటౌన్ : స్థానిక డైట్ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం ముందస్తు ఉగాది వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ ఈ ఉగాది పండగ అందరికీ ఆయురారోగ్య, ఐశ్వర్యాలను తెచ్చిపెట్టాలని ఆకాంక్షించారు. విద్యార్థులు కళాశాల ప్రాంగణాన్ని అందంగా అలంకరించారు. విద్యార్థులకు మ్యాంగో కార్వింగ్ పోటీలు నిర్వహించారు. ఉగాది పచ్చడిని రత్నాకర్ రుచి చూసి విజేతలకు బహుమతులందించారు. వేడుకల్లో ప్రిన్సిపాల్ చల్లా నరసింహం, వైస్ ప్రిన్సిపాల్ వైకుంఠరావు, అకడమిక్‌డీన్ ఈశ్వరరావు, కన్వీనర్ కృష్ణనాగ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

హామీల అమలు కోరుతూ ఉద్యోగుల నిరసన

తుమ్మపాల : ఏపీ జేఏసీ అమరావతి ఆందోళన కార్యక్రమంలో భాగంగా ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కారించాలని కోరుతూ కలెక్టరేట్ గేటు వద్ద జేఏసీ నాయకులు మంగళవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ నెల 21 నుంచి అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో వర్క్ టు రూల్ పాటిస్తామని అసోసియేషన్ చైర్మన్ టీవీ ఫణిపేర్రాజు తెలిపారు. నిరసనలో భాగంగా ఈ నెల 27న కారుణ్య నియామకాల కోసం ఎదురుచూస్తున్న కుటుంబసభ్యులను కలిసి వారి బాధలను మీడియా ద్వారా ప్రభుత్వానికి తెలియజేస్తామన్నారు. సీపీఎస్ రద్దు, కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ, జీతభత్యాల పెంపు, సీఎం ఇచ్చిన హామీల అములుపై ఏప్రిల్ 5లోగా స్పష్టత ఇవ్వాలని కోరారు. అప్పటి వరకు నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరవుతామన్నారు. కార్యక్రమంలో జిల్లా జేఏసీ జనరల్ సెక్రటరీ డి.లోవరాజు, ఏపీసీపీఎస్‌ఈఏ రాష్ట్ర అధ్యక్షుడు రొంగలి అప్పలరాజు, రెవెన్యూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పీవీ రమణ, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రాగి జావతో.. మరింత పోషణ

- పిల్లల ఆరోగ్యానికి సీఎం జగన్ భరోసా
- రాగిజావ పంపిణీలో స్థానిక నేతలు

అనకాపల్లిటౌన్ : పిల్లలకు మెరుగైన విద్యతోపాటు పోషకాహారం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జగనన్న గోరుముద్ద పథకాన్ని అమలు చేస్తోంది. ఇప్పటికే మెనూలో అదనపు పోషకాలు జత చేసిన ప్రభుత్వం, విద్యార్థులకు మరిన్ని పోషక విలువలతో కూడిన రాగిజావను అందించే కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించింది. రాగిజావ పంపిణీ సందర్భంగా పలు పాఠశాలల్లో పండగ వాతావరణం కనిపించింది. గోరుముద్దకు మరిన్ని పోషకాలను చేర్చడమే ప్రభుత్వ స్కూళ్లలో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్య సంరక్షణకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇస్తున్న భరోసా అని వక్తలు కొనియాడారు.

- రాగిజావ తీసుకోవడం ద్వారా రోగనిరోధక శక్తి పెంపొందడంతోపాటు, తక్షణ శక్తి నిస్తుందని 83వవార్డు కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి అన్నారు. స్థానిక జీవీఎంసీ వేల్పులవీధి బాలికోన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం ఆమె రాగి జావ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వారంలో మూడురోజులు రాగిజావను అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, జెడ్పీ వెంకటరమణ, హెచ్‌ఎం బి.తులసీదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.
- రాష్ట్రంలో విద్యాభివృద్ధికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎనలేని కృషి చేస్తున్నారని 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత కొనియాడారు. స్థానిక జీవీఎంసీ గాంధీనగరం ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆమె రాగిజావ అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంచి పోషక విలువలతో కూడిన రాగిజావను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకిరామరాజు, ఉపాధ్యాయులు డి.విశ్వేశ్వరరావు, ఎం.ఉమామహేశ్వరరావు, పార్టీ నేతలు కొండూరు రవీంద్ర, ఆకుల సంతోష్, నంబారి అప్పారావు, పలకా వాసు, జి.శేషగిరిరావు, శర్మ, శివలక్ష్మి, కోన ఉమా, పేలూరి కల్యాణ్, సత్తిబాబు, వాసు పాల్గొన్నారు.
- పూర్వీకుల ఆరోగ్యానికి ఎంతగానో దోహదపడిన రాగిజావను జగనన్న గోరుముద్దలో చేర్చడం అభినందనీయమని ఎంపీపీ గొర్లి సూరిబాబు అన్నారు. మండలంలోని సీతానగరం, అక్కిరెడ్డిపాలెం, తారకరామకాలనీ హైస్కూళ్లలో ఆయన మంగళవారం విద్యార్థులకు రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎముకల దృఢత్వం, రక్తహీనత నివారణకు రాగిజావ ఉపకరిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంఈవో దివాకర్, ఎంపీడీవో ధర్మారావు, పార్టీ నేతలు ఆనందరాము, రాపేటి నాగేశ్వరరావు, సుంకర చంటి, రాపేటి వెంకటేష్, జంపన శివాజీవర్మ, పొలమరశెట్టి నరసింగరావు, సచివాలయ కన్వీనర్ నారపిన్ని ప్రసాద్, స్కూల్ చైర్మన్‌లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



జీవీఎంసీ బాలికోన్నత పాఠశాలలో మాట్లాడుతున్న జెడ్పీ వెంకటరమణ



గాంధీనగరం స్కూల్లో రాగిజావ అందిస్తున్న సునీత, జానకిరామరాజు దంపతులు

అనకాపల్లి రూరల్ : తుమ్మపాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాగిజావ పంపిణీని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్ ప్రారంభించారు. రాగిజావను విద్యార్థులతో పాటు రుచి చూశారు. బెల్లం కలిపిన రాగిజావ విద్యార్థులు ఇష్టంగా తాగారు. ఈ సందర్భంగా దిలీప్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్ని బలోపేతం చేసేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారని కొనియాడారు. పాఠశాలల్లో నాణ్యమైన విద్యనందించేందుకు ప్రభుత్వం ఎంతో చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో తుమ్మపాల గ్రామ సర్పంచ్ తట్టా పెంటయ్య నాయుడు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



తుమ్మపాల హైస్కూల్లో రాగి జావ పంపిణీ చేస్తున్న దంతులూరి దిలీప్ కుమార్

కశింకోట : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం రాగి జావ పంపిణీ కార్యక్రమం ప్రారంభమైంది. కశింకోట బాలికల హైస్కూల్లో సర్పంచ్ మంత్రి జయరజని విద్యార్థులకు రాగి జావను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రక్తహీనత నివారణకు రాగిజావ ఎంతగానో ఉపకరిస్తుందన్నారు. విద్యార్థులంతా రాగిజావను తప్పకుండా తీసుకోవాలని సూచించారు.

కార్యక్రమంలో ఎంఈవో చిట్టిబాబు, హెచ్‌ఎంలు ఎ.శ్రీధర్‌రెడ్డి, ఎం.ఎస్.స్వర్ణకుమారి, స్కూల్ కమిటీ అధ్యక్షుడు యల్లపు శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యురాలు వరలక్ష్మి, పీడీ పెంటకోట కమల, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

- మండలంలోని తాళ్లపాలెం హైస్కూల్, 1, 2, 4 ప్రాథమిక పాఠశాలల్లో కూడా రాగి జావ పంపిణీ చేశారు. ఎంపీటీసీ సభ్యురాలు లగిశెట్టి భవాని ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి లగిశెట్టి గణేష్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.



సీతానగరం పాఠశాలలో విద్యార్థులకు రాగిజావ అందిస్తున్న గొర్లి సూరిబాబు



తాళ్లపాలెం స్కూల్లో రాగి జావ పంపిణీ చేస్తున్న ఎంపీటీసీ లగిశెట్టి భవాని



కశింకోట బాలికల హైస్కూల్లో రాగి జావ పంపిణీ చేస్తున్న సర్పంచ్ జయరజని